సాక్షి
చిత్తూరు
సోమవారం । 2 । జూన్ । 2025



అర్ధగిరిలో భక్తుల రద్దీ

అర్ధగిరి ఆంజనేయస్వామి క్షేత్రం ఆదివారం భక్తుల రద్దీతో కిక్కిరిసిపోయింది. అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. - 8లో



ఆగని గజరాజుల దాడులు

పెద్దపంజాణి మండలంలో గజరాజుల దాడులు కొనసాగుతున్నాయి. మామిడి కొమ్మలు విరిచేసి కాయలు ఆరగించి వెళ్లాయి. - 8లో



కిటకిటలాడిన బోయకొండ

జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండకు ఆదివారం భక్తులు తరలిరావడంతో కిటకిటలాడింది. - 8లో

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 2వ తేదీన సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. దీనికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. గైర్హాజరయ్యే వారిపై శాఖాపరంగా చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

పోలీసు కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: నగరంలోని వన్‌టౌన్ పక్కన ఉన్న ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలకు సమస్యలు ఏవైనా ఉంటే తనను నేరుగా కలిసి మాట్లాడొచ్చన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడతామని ఎస్పీ తెలిపారు.

నేడు పులిగుండు వద్ద యోగాంధ్ర



కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని గంగాధరనెల్లూరు నియోజకవర్గం పెనుమూరు మండలంలోని పులిగుండు వద్ద ఈ నెల 2వ తేదీన యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం క్షేత్రస్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పులిగుండు వద్ద నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాంధ్రను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో యోగాపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇది వరకే కాణిపాకంలో కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ నెల 2వ తేదీన పులిగుండు వద్ద దాదాపు 2 వేల మందితో కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

డీఈవో కార్యాలయంలో ప్రక్షాళన

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో కీలక శాఖల్లో ఒకటైన విద్యాశాఖ(డీఈవో) కార్యాలయంలో ప్రక్షాళన మొదలైంది. ఈ మేరకు ఆ కార్యాలయంలో ఏళ్ల తరబడి కొందరు సూపరింటెండెంట్‌లు ఒకే చోట పాతుకుపోయారు. వారందరికీ ఈ బదిలీల్లో స్థానచలనం కల్పించారు. ఈ మేరకు ఆదివారం వైఎస్సార్ కడప జిల్లా ఆర్జేడీ శామ్యూల్ ఉత్తర్వులు జారీచేశారు. రాయలసీమ జోన్ పరిధిలో నిర్వహించిన బదిలీల్లో పలువురు సూపరింటెండెంట్లకు బదిలీలు నిర్వహించారు. ఇందులో చిత్తూరు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సూపరింటెండెంట్లు వీజీ రమణ, సత్యనారాయణను వైఎస్సార్ కడప జిల్లా (డీఈవో కార్యాలయం)కు బదిలీ చేశారు. చిత్తూరు డీఈవో కార్యాలయంలోని సూపరింటెండెంట్లు ప్రేమకుమారిని వైఎస్సార్ కడప జిల్లా సమగ్ర శిక్ష శాఖకు, రామ్‌కుమార్‌ను అన్నమయ్య జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు డీఈవో కార్యాలయంలో పనిచేస్తున్న నలుగురు సూపరింటెండెంట్లకు స్థానచలనం కల్పించారు.



చిత్తూరు విద్యాశాఖ కార్యాలయం

నూతన సూపరింటెండెంట్లు వీరే

ప్రస్తుత బదిలీల్లో ఇతర జిల్లాల నుంచి పలువురు సూపరింటెండెంట్లు చిత్తూరు డీఈవో కార్యాలయానికి విచ్చేయనున్నారు. తిరుపతి జిల్లా పాఠ్యపుస్తకాల గోడౌన్ సూపరింటెండెంట్ గా ఉన్న రమేష్, కర్నూలు జిల్లా డీఈవో కార్యాలయంలో ఉన్న రవికుమార్‌కు చిత్తూరు పోస్టింగ్ ఇచ్చారు. తిరుపతి డీఈవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న నందకుమార్, చిత్తూరు సమగ్రశిక్ష శాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న స్వర్ణకుమారికి ఉద్యోగోన్నతులు కల్పించారు. ఆ ఇద్దరినీ చిత్తూరు డీఈవో కార్యాలయంలో సూపరింటెండెంట్లు నియమిస్తున్నట్లు ఆర్జేడీ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



• ఈ చిత్రంలో కనిపించేది చిత్తూరు నగరం గిరింపేటలోని చౌకదుకాణం. ఉదయం 8 గంటలకు ఈ షాపులో పంపిణీ ప్రారంభించారు. అయితే క్యూలో వేచి ఉన్న కార్డుదారులు నేను ముందు..నువ్వు నా వెనుక.. నువ్వు ఇప్పుడే కదా వచ్చావు. వెనకకు వెళ్లు. ముందు రావద్దు.. నేను ఒప్పుకోను. క్యూలో రావాలని తెలియదా అంటూ అరుపులు కేకలతో గందరగోళంగా మొదలైంది.



• ఈ చిత్రంలో కనిపించే దుకాణం చిత్తూరు నగరం దుర్గానగర్ కాలనీలో ఉంది. ఉదయం 8 గంటలకే రేషన్‌పంపిణీ చేస్తారని చాలా మంది కార్డుదారులు వచ్చి దుకాణం ముందు బ్యాగులు, సంచులను ఇలా క్యూలో పెట్టి పక్కకు వెళ్లి కూర్చున్నారు. ఉదయం 8.35 గంటల సమయం వరకు అక్కడ రేషన్ షాపు తెరుచుకోలేదు. గంట ఆలస్యంగా తెరుచుకోవడంతో కార్డుదారులకు ఇబ్బందులు తప్పలేదు.



• చిత్తూరు నగరం సత్యనారాయణపురం ప్రాంతంలోని 60వ షాపులో ఉదయం 10 గంటలకు సర్వర్ మొరాయించింది. దీంతో డీలర్ బయోమెట్రిక్ మిషన్‌ను కార్యాలయానికి ఇచ్చి పంపారు. అక్కడికెళ్లి చూస్తే నగరమంతా సర్వర్ సమస్య ఉన్నట్లు తెలుసుకున్నారు. దీంతో కార్డుదారులు గంటలకొద్దీ పడిగాపులు కాశారు. మధ్యాహ్నం వరకు రేషన్‌కోసం నిరీక్షించి నీరసించి పోయారు. ఈ పక్కన ఉన్న షాపులో కార్డుదారులను గదమాయిస్తూ బెదిరింపులకు గురిచేశారు. అన్ని చోట్ల నీడ కల్పించాలని చెప్పినా అలాంటివేవీ కనిపించలేదు.

మళ్లీ పరేషన్

- రేషన్ కోసం కష్టాలు మొదలు
- పాత దుకాణాలకు కొత్త సోకులు
- వృద్ధులు, మహిళల పడిగాపులు
- పలు చోట్ల మొరాయించిన సర్వర్లు

కార్వేటినగరం మండలంలో అటవీ ప్రాంతం మీదుగా రేషన్ తెచ్చుకుంటున్న వృద్ధులు



సాక్షి ప్రతినిధి, తిరుపతి : కూటమి పాలనలో సేవలు ఒక్కొక్కటిగా రద్దవుతుండడంతో జనం వీధినపడుతున్నారు. నాడు ఇంటింటికీ వచ్చి సేవలందించే వలంటీర్ల వ్యవస్థకు నేడు మంగళం పాడారు. గ్రామ సచివాలయాల్లో అందుతున్న సేవలు నేడు అందకపోవటంతో జనం మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లక తప్పడం లేదు. తాజాగా ఇంటింటికీ రేషన్ చేరవేసే వాహనాలను రద్దు చేసి లబ్ధిదారులంతా దుకాణాల వద్దకు వెళ్లి బియ్యం, చక్కెర ఇతరత్రా సరుకులు తీసుకోవాలని ఆదేశించారు. కూటమి సర్కారు తీసుకున్న నిర్ణయంతో ఆదివారం రేషన్ లబ్ధిదారులంతా వీధినపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇంటింటికీ రేషన్ పంపిణీకి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. డీలర్లు వాహనాల్లో రేషన్ తీసుకుని లబ్ధిదారుని నివాసానికి వెళ్లి సరుకులు పంపిణీ చేసేవారు. కూటమి పాలన వచ్చిన వెంటనే రేషన్ డోర్ డెలివరీకి మంగళం పాడేశారు. లబ్ధిదారులంతా రేషన్ దుకాణానికే వెళ్లి సరుకులు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

అట్టహాసంగా ప్రారంభోత్సవాలు

తిరుపతి, చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఆదివారం రేషన్ దుకాణాల ప్రారంభోత్సవాలు అట్టహాసంగా నిర్వహించారు. పాత రేషన్ దుకాణాలకు మామిడి తోరణాలు, పూలు అలంకరించి స్థానిక ఎమ్మెల్యే, స్థానిక కూటమి నేతల ద్వారా ప్రారంభోత్సవాలు చేశారు. ఈ ప్రారంభోత్సవాలకు వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యేలు, మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లను ఆహ్వానించవద్దని అధికారులను ఆదేశించారు. దీంతో కూటమి ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులే ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఆలస్యమైనా కూటమి నేతలు వచ్చే వరకు రేషన్ పంపిణీ చేయడానికి వీల్లేదని అనేక చోట్ల డీలర్లకు హుకుం జారీ చేసినట్లు సమాచారం.

గంటల తరబడి ఎండలో నిల్చొని..

రేషన్ డోర్ డెలివరీ వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేయటంతో చేసేది లేక లబ్ధిదారులంతా ఆదివారం ఉదయమే దుకాణాల వద్దకు చేరుకున్నారు. అయితే కూటమి ఎమ్మెల్యే, స్థానిక నాయకులు వచ్చే వరకు రేషన్ వేయద్దని చెప్పడంతో లబ్ధిదారులంతా ఎండలో బారులు తీరక తప్పలేదు. కొన్ని చోట్ల కూటమి నేతలు వచ్చి ప్రారంభించి వెళ్లిపోయాక డీలర్లు ఇద్దరు, ముగ్గురికి సరుకులు పంపిణీ చేసి సోమవారం రండి అని వెనక్కు పంపించివేశారు. చిత్తూరు నగరంలోనే కాకుండా అనేక చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. మరో వైపు అనేక ప్రాంతాల్లో సర్వర్లు మొరాయించటంతో గంటల తరబడి ఎండలో వేచి ఉండక తప్పలేదు. డోర్ డెలివరీ లేకపోవటంతో రెండు, మూడు కిలోమీటర్ల నుంచి లబ్ధిదారులు రేషన్ దుకాణాలకు తరలిరావడం కనిపించింది. గంటల తరబడి వేచి ఉండి రేషన్ తీసుకుని నెత్తిన మోసుకుని ఎండలోనే సొంత ఊర్లకు తిరిగి వెళ్తూ కనిపించారు. మరి కొన్ని చోట్ల రేషన్ దుకాణాలు తెరుచుకోకపోవటంతో లబ్ధిదారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఇంకొన్ని చోట్ల దుకాణాలు ఆలస్యంగా తెరుచుకోవడంతో అప్పటి వరకు లబ్ధిదారులు పడిగాపులు గాశారు.

కూలి పనులు వదులుకుని..

రేషన్ కోసం పేదవాడి తిప్పలు అన్నీ ఇన్నీ కావు. కూటమి పాలన వచ్చాక రేషన్ ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. డోర్ డెలివరీ రద్దు చేయటంతో ఆ రేషన్ కోసం కూలీ నాలీ చేసుకుని బతికేటోళ్లు అనేక మంది ఆదివారం పనులన్నీ మానేశారు. ఒకటో తేదీ ప్రారంభిస్తారు కనుక కచ్చితంగా రేషన్ తీసుకోవచ్చని భావించి అనేక మంది కూలీ పనులు మానేసి దుకాణాలకు చేరుకున్నారు. ఇదే విషయం అక్కడున్న వారు చర్చించుకోవటం కనిపించింది. చేసేది లేక కూటమి పాలకులను తిట్టుకుంటూ లబ్ధిదారులు వెనుదిరిగి వెళ్లిపోవటం కనిపించింది.

జాడలేని కంది పప్పు

కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రేషన్ దుకాణాల్లో బియ్యం తప్ప మిగిలిన సరుకులు అరకొరగానే సరఫరా చేస్తున్నారు. ఆదివారం ఆర్భాటంగా ప్రారంభించిన రేషన్ దుకాణాల్లోనూ కందిపప్పు పూర్తిగా సరఫరా చేయలేదు. చక్కెర అరకొరగానే ఇచ్చారు. చిత్తూరు జిల్లాలో మొత్తం 1,339 చౌకదుకాణాలు ఉన్నాయి. ఈ చౌక దుకాణాల పరిధిలో 5.40 లక్షల రేషన్ కార్డుదారులు ఉన్నారు. ఈ నెల కోటా కింద 8,320 మెట్రిక్ టన్నుల బియ్యం, 256 మెట్రిక్ టన్నుల చక్కెర సరఫరా చేశారు. కందిపప్పు మాత్రం సరఫరా చేయలేదని తెలిసింది. కార్డు దారులకు బియ్యం, అరకొర చక్కెర మాత్రమే పంపిణీ చేస్తున్నారు.

ఐదు కేజీలకు పది కిలోమీటర్లు



నాకు 85 సంవత్సరాలు. నాకు తోడు ఎవరూ లేరు. ప్రభుత్వం అందించే ఐదు కేజీల బియ్యానికి సుమారు మూడు కిలోమీటర్లు అడవి ప్రాంతంలో నడుచుకుంటూ వెళ్లాలి. రోడ్డుపై వెళ్లాలంటే 10 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుంది. గత ప్రభుత్వంలో వాహనం ద్వారా ఇంటి వద్దకే బియ్యం పంపిణీ చేసేవారు. నేడు కిలోమీటర్ల దూరం నడక తప్పడం లేదు.

– బొజ్జమ్మ, జగన్నాథపురం ఎస్టీ కాలనీ, కార్వేటినగరం మండలం

బదిలీల్లో ఏకపక్ష నిర్ణయాలు సరికాదు



రెడ్డి శేఖర్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్ల బదిలీల్లో అధికారుల ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సరికాదని వైఎస్సార్‌టీఏ ట్రెజరర్ రెడ్డిశేఖర్‌రెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలకు చేసిన చట్టం అధికారులకు చుట్టం అయ్యిందే తప్ప ఉపయోగం లేదని విమర్శించారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు తీసుకుంటున్న ప్రతి పూటకో నిర్ణయం వివాదంగా ఉందన్నారు. గత మూడేళ్లుగా ఉద్యోగోన్నతి పొందిన స్కూల్ అసిస్టెంట్స్ 196 మంది బదిలీకి దరఖాస్తు చేసుకుని పీఎస్‌హెచ్‌ఎంగా వెళ్లాలని, ప్రిఫరెన్షియల్ కేటగిరీ, విడో, విడాకులు తీసుకున్న మహిళలపై దుర్మార్గ నిర్ణయాలు తీసుకోవడం సబబు కాదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమాంతర తెలుగు మాధ్యమం లేకుండా చేయడం అన్యాయమన్నారు. విద్యార్థి నిష్పత్తి 1:40 కాకుండా 1:49 చేసి మిగులు టీచర్లను ప్రాథమిక బడులకు తరలించడం పద్ధతి కాదని విమర్శించారు. చట్టంలోని నియమ, నిబంధనలను పాటించకుండా టీచర్ల వ్యతిరేక విధానాలతో 6304 మంది ఎస్జీటీలు ఉద్యోగోన్నతికి నోచుకోక నష్టపోయారన్నారు.

ఇంటర్ అడ్మిషన్ల సంగతేంటి?

- మండలాలకు చేరిన పాఠ్యపుస్తకాలు
- అడ్మిషన్ల ఊసే ఎత్తని ఇంటర్మీడియట్ అధికారులు
- నేడు జూనియర్ కళాశాలలు పున: ప్రారంభం
- వైఎస్సార్‌సీపీ సర్కారులో మెరుగుపడ్డ విద్యాసంస్థలు



జిల్లా కేంద్రానికి చేరిన ఇంటర్మీడియట్ పాఠ్యపుస్తకాలు

చిత్తూరు కలెక్టరేట్ : జూనియర్ కళాశాలలకు ఈ నెల 1వ తేదీతో వేసవి సెలవులు ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా జూన్ 2వ తేదీ నుంచి జూనియర్ కళాశాలలు పున: ప్రారంభం కానున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు పొందే మొదటి సంవత్సరం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే జిల్లాకు చేరిన పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలను ఇంటర్మీడియట్ అధికారులు జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చేరవేశారు. సోమవారం నుంచి కళాశాలలు పున: ప్రారంభం కానుండడంతో నూతన అడ్మిషన్ల ప్రక్రియను మొదలు పెట్టారు. ఇటీవల జూనియర్ కళాశాలల్లో బదిలీల ప్రక్రియ నిర్వహించారు. ఈ ప్రక్రియలో పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో లెక్చరర్లు బదిలీ అయ్యారు. బదిలీ అయిన లెక్చరర్లు కొత్త కళాశాలల్లో విధుల్లో చేరనున్నారు.

74 కళాశాలలకు పాఠ్యపుస్తకాలు

జిల్లా వ్యాప్తంగా ఉన్న 74 ప్రభుత్వ కళాశాలలకు ఇంటర్మీడియట్ అధికారులు ముందస్తుగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఆయా కళాశాలలు శుభ్రం చేయించి పున:ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలోని 31 ప్రభుత్వ, కేజీబీవీ 8, హైస్కూల్ ప్లస్ 28, ఏపీ మోడల్ జూనియర్ కళాశాలలు 7 ఉన్నాయి. ఈ కళాశాలలకు మొదటి సంవత్సరానికి సంబంధించి 28,807, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 5,464 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసేందుకు సిద్ధం చేశారు.

కానరాని ముందస్తు ప్రణాళిక

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు గత విద్యాసంవత్సరం అధిక శాతం పరీక్షల్లో ఫెయిలయ్యారు. గత విద్యా సంవత్సరంలో పటిష్ట ప్రణాళిక, తరగతులు సక్రమంగా నిర్వహించకపోవడంతో విద్యార్థులు నష్టపోయారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలోనైనా ముందస్తు ప్రణాళికతో ముందుకు సాగితే మంచి ఫలితాలు సాధించవచ్చని విద్యావేత్తలు వెల్లడిస్తున్నారు.

అడ్మిషన్ల మాటే మరిచారు

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లను పెంచేందుకు గతంలో పటిష్ట ప్రణాళిను అమలు చేసేవారు. ఊరూరా ప్రచారం నిర్వహించేవారు. అయితే ప్రస్తుతం జిల్లాలో ఎక్కడా అడ్మిషన్‌ల ప్రచారం ఊసే కనిపించలేదు. ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు ముందస్తుగా అడ్మిషన్‌ల వేటలో ఉంటే ప్రభుత్వ కళాశాలలు మాత్రం తమకెందుకులే అన్న ధోరణిలో ఉన్నాయి. ప్రతి ఏటా గతం కంటే అడ్మిషన్లను పెంచేలా చర్యలు చేపట్టేవారు. అయితే ఈ విద్యాసంవత్సరం అలాంటి చర్యలేమీ జిల్లాలో జాడలేదు. దీంతో ఈ విద్యాసంవత్సరం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు అంతంత మాత్రమే జరుగుతాయని పలువురు చర్చించుకుంటున్నారు.

జిల్లా సమాచారం

ప్రభుత్వ జూనియర్ కళాశాలలు	31
కేజీబీవీ	08
హైస్కూల్ ప్లస్	28
ఏపీ మోడల్ కళాశాలలు	07
మొత్తం కళాశాలలు	74
ద్వితీయ సంవత్సరం విద్యార్థులు	5,464

వైఎస్సార్‌సీపీ సర్కారులో మెరుగు

గత వైఎస్సార్‌సీపీ సర్కారు పాలనలో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మెరుగుపడ్డాయి. 2019వ సంవత్సరానికి ముందు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌళిక వసతులు అరకొరగా ఉండేవి. వాటిని మెరుగుపరిచేందుకు అప్పటి టీడీపీ సర్కారు ఏ మాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు. 2019 తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ సర్కారు జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలను నాడు నేడు పథకంతో కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దింది. అదే విధంగా ఇంటర్మీడియట్ విద్యనభ్యసించే విద్యార్థులకు అమ్మఒడి పథకం అమలు చేసింది. ప్రస్తుత కూటమి టీడీపీ సర్కారు ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభివృద్ధి మాటే మరిచింది.

ఒకే ఒక్కడు

అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య



ట్యాబ్‌ల పంపిణీ అనంతరం జగన్ మామయ్యతో సెల్ఫీ దిగుతున్న విద్యార్థినులు (ఫైల్)

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని సర్కారు బడుల్లో చదువుతున్న పేదింటి పిల్లలు అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలు సాధించేలా చర్యలు చేపట్టిన ఘనత ఒక్క వైఎస్ జగన్‌కే దక్కింది. ప్రతి పేద విద్యార్థి అంతర్జాతీయ వేదికపై తమ సత్తా చాటాలన్న ఆశయంతో మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 8వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లను అందజేశారు. దాదాపు రూ.17,500కు పైగా మార్కెట్ విలువ చేసే ఒక్కొక్క ట్యాబ్, రూ.15,500 విలువ చేసే బైజూస్ కంటెంట్‌తో కలిపి ప్రతి విద్యార్థికి రూ.33 వేల విలువ చేసే లబ్ధిని చేకూర్చారు. పాఠాలు బోధించే అన్ని సబ్జెక్టుల టీచర్లకు సైతం ట్యాబులను ఉచితంగా పంపిణీ చేశారు. ఆ ట్యాబుల్లో 8వ తరగతితో పాటు 9, 10 తరగతుల బైజూస్ కంటెంట్‌ను సైతం లోడ్ చేసి అందజేశారు. ఇంటర్మీడియట్ కంటెంట్ కూడా అప్‌లోడ్ చేసేందుకు వీలుగా ట్యాబ్ సామర్థ్యాన్ని 256 జీబీకి పెంచి పంపిణీ చేశారు. ఈ ట్యాబ్‌లను అందుకున్న విద్యార్థులు తమ విద్యాసామర్థ్యాలను పెంచుకుని ప్రస్తుతం విద్యలో ముందడుగు వేస్తున్నారు.

గత వైఎస్సార్‌సీపీ సర్కారులో ఉచితంగా అందజేసిన ట్యాబ్‌ల వివరాలు..

సంవత్సరం	ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులు	ట్యాబ్‌లు అందుకున్న టీచర్లు	ఖర్చు చేసిన మొత్తం రూ.
2021–22	9,248	1,145	34.30 కోట్లు
2022–23	10,578	–	34.91 కోట్లు
మొత్తం	19,826	1,145	69.21 కోట్లు

కిక్కిరిసిన కాణిపాకం



కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి క్షేత్రం ఆదివారం భక్తజనసంద్రంగా మారింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలో రద్దీ నెలకొంది. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర, వీఐపీ దర్శన క్యూలన్నీ కిక్కిరిసిపోయాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. - కాణిపాకం

అర్ధగిరి క్షేత్రంలో భక్తుల రద్దీ

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో అర్చకులు స్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం స్వామికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ధూపదీపనైవేద్యం సమర్పించారు. ఆదివారం సెలవు కావడంతో భక్తుల రద్దీ పెరిగింది. సహజసిద్ధమైన సంజీవరాయ పుష్కరిణి తీర్థం సేవించి బాటల్లో తీసుకెళ్లారు. భక్తులు ఎండలు అధికంగా ఉన్నా ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకున్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

బంగారుపాళెం: మండలంలోని కేఎం కండ్రిగ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యంపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. గ్రామానికి చెందిన ఆ బాలిక శనివారం సాయంత్రం నుంచి కనిపించలేదని బాలిక తండ్రి మోహన్ ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పిచ్చికుక్కల దాడిలో పశువులకు గాయాలు

బంగారుపాళెం: మండలంలోని పెరుమాళ్లపల్లె, తుంబకుప్పం గ్రామాల్లో శనివారం రాత్రి పిచ్చికుక్కల దాడితో పశువులు గాయపడినట్లు బాధిత రైతులు తెలిపారు. మూడు పిచ్చికుక్కలు స్వైరవిహారం చేసి పెరుమాళ్లపల్లెలో 20 పశువులు, తుంబకుప్పంలో 25 పశువులపై దాడి చేసి గాయపరచినట్లు వాపోయారు. పిచ్చికుక్కలను గ్రామస్తులు వెంటాడి చంపేసినట్లు తెలిపారు. అంతేకాకుండా పెరుమాళ్లపల్లె, తుంబకుప్పం, నల్లంగాడు పంచాయతీలలో కుక్కల బెడదతో ఇబ్బందులు పడాల్సివస్తోందని గ్రామస్తులు తెలిపారు.

మద్యం విక్రేత అరెస్టు

చౌడేపల్లె: మద్యం విక్రయిస్తున్న వృద్ధురాలిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. పెద్దయల్లకుంట్ల పంచాయతీ ఊటూరుకు చెందిన రెడ్డెమ్మ చిల్లర అంగడి నిర్వహిస్తోంది. మద్యం విక్రయిస్తోందని అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా 25 క్వార్టర్ బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మద్యం విక్రయాలపై పోలీసులకు సమాచామిస్తే వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఆగని గజరాజుల దాడులు

పెద్దపంజాణి: ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు ఏనుగుల నుంచి రక్షణ లేకుండా పోతోంది. మండలంలోని తిప్పిరెడ్డిపల్లి, కొత్తబూరగపల్లి, పెనుగొలకల, పెద్దకాపల్లి, ముదిరెడ్డిపల్లి, బందార్లపల్లి, జిట్టంవారిపల్లి, గౌరీనగర్, అకులవారిపల్లి, బేరుపల్లి, రాగిమాకులపల్లి, గొదమాకులపల్లి, కమ్మపాళ్యం, గంకొండ, చీకలదిన్నేపల్లి తదితర గ్రామాలు అటవీ సరిహద్దులు కలిగి ఉన్నాయి. తరచూ ఏదో ఒక గ్రామంలో పంటలను ఏనుగులు నాశనం చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఇక్కడి ఏనుగులను కట్టడి చేసేందుకు పక్క రాష్ట్రమైన కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులు తీసుకువచ్చింది. అయినా వాటి వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని రైతులు చర్చించుకుంటున్నారు. తాజాగా ఆదివారం వేకువజామున పలమనేరు రేంజ్ కీలపట్ల ఫారెస్టు బీటు నుంచి వచ్చిన ఏనుగుల గుంపు తిప్పిరెడ్డిపల్లెకు చెందిన చంద్రారెడ్డి, అమరారెడ్డి, బాబు రెడ్డి తదితరుల మామిడి తోటలపై విరుచుకుపడ్డాయి. మామిడి కొమ్మలను విరిచేసి సుమారు ఒక టన్ను కవర్లు కట్టిన బేనీషా, ఖాదర్, ఇమామ్‌పసంద్ మామడి కాయలను నెమరువేశాయి. ఈ దాడుల్లో దాదాపు రూ.50 వేల నష్టం జరిగినట్లు అంచనా. ఉదయం తోటలోకి వెళ్లిన రైతులు ఏనుగుల విధ్వంసాన్ని చూసి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. బాధిత రైతులు వెంటనే జిల్లా అటవీశాఖ అధికారిణికి సమాచారం చేరవేశారు. స్పందించిన ఆమె క్షేత్రస్థాయి అధికారులను సంఘటనా స్థలానికి పంపించి పూర్తి వివరాలతో కూడిన నివేదికను తన కార్యాలయంలో అందజేయాలని ఆదేశించారు.


ఏనుగులు మామిడికాయలను తినేసి నేలరాల్చిన కవర్లు

జేఎల్‌ఎంల ఇష్టారాజ్యం!



విధులు నిర్వరిస్తున్న జేఎల్‌ఎం (ఫైల్)

పలమనేరు: గ్రామాల్లో ఎలాంటి విద్యుత్ సమస్యలొచ్చినా వెంటనే బాగు చేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ సేవల్లో భాగంగా జూనియర్ లైన్‌మన్ (జేఎల్‌ఎం) విధానాన్ని ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థ పూర్తిగా చిన్నాభిన్నం అయిపోయింది. ఇందులోని ఉద్యోగులు పలు రకాల సర్వేల్లో మునిగిపోయారు. ఫలితంగా సచివాలయాల్లో ఎలాంటి సేవలు లేకుండా బోసిపోయింది. ఈ నేపత్యంలో అత్యవసర సేవలంటూ హాజరు నుంచి వెసులుబాటు ఉన్న జూనియర్ లైన్‌మన్‌లు అటు సచివాలయాలకు రాకుండా ఇలా ప్రజలకు అవసరమైన సేవలు చేయకుండా నెల నెలా జీతాలు మాత్రం తీసుకుంటూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వీరిని పర్యవేక్షించాల్సిన సంబంధిత మండలాల ట్రాన్స్‌కో అధికారులు అసలు పట్టించుకోవడం లేదు. ఇక సచివాలయాలకు బాధ్యులైన ఎంపీడీవోలకు వీరిపై అజమాయిషీ లేదు.

జేఎల్‌ఎం విధులు

ఆయా పంచాయతీలోని సీనియర్ లైన్‌మన్‌కు సహాయకులుగా ఉంటూ గ్రామాల్లో విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి. పంచాయతీలో నూతన విద్యుత్ స్తంభాలు, లైన్ల ఏర్పాటు చేపట్టాలి. ఏదేని మరమ్మతులు వస్తే వెంటనే స్పందించాలి. ప్రజలకు అవసరమైన విద్యుత్ సమస్యలను వెంటనే బాగుచేయాలి. ఎందుకంటే మండల స్థాయిలో ట్రాన్స్‌కోలో పనిచేసే సిబ్బంది తక్కువగా ఉండడంతో సమస్యల పరిష్కారం ఆలస్యమవుతుందనే గ్రామ స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వీరిని నియమించి సచివాలయాలకు అనుసంధానం చేసింది.

జరుగుతున్నదేమిటంటే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయంలో పదిశాఖల చెందిన వారికి పలు రకాల సర్వేలను అంటగట్టింది. అయితే వీరు ఉదయం, సాయంత్రం విధిగా సచివాయలాల వద్దకెళ్లి హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. కానీ అత్యవసర సేవల్లో ఉన్నందున జేఎల్‌ఎంలు మాత్రం ఏ సచివాలయం వద్దనైనా హాజరు వేసుకునే వెసులుబాటు ఉంది. దీంతోపాటు వీరికి ఎలాంటి సర్వేలు లేవు. దీన్ని ఆసరాగా చేసుకొని 80శాతం మంది జేఎల్‌ఎంలు అసలు విధులకు హాజరు కావడంలేదు. కనీసం సంబంధిత ట్రాన్స్‌కో ఏఈలు చెప్పిన పనులు చేయడం లేదు. ప్రజలకు సంబంధించిన సేవలు చేయాలన్నా ఎంతో కొంత చేతిలో పెడితేగానీ పనులకు రావడం లేదు. ఎందుకంటే వీరిపై అజమాయిషీ ఎంపీడీవోలకు లేదు.

జేఎల్‌ఎంల సమాచారం	
జిల్లాలో మొత్తం మండలాలు :	31
గ్రామపంచాయతీలు :	797
మొత్తం గ్రామాలు :	822
సచివాలయాలు :	11,158
వీటిలో జూనియర్ లైన్‌మన్‌లు :	11వేలమంది

జేఎల్‌ఎంలపై ఎంపీడీవో ఫిర్యాదు

జిల్లాలో మొత్తంగా వీరి పనితీరు సరిగ్గాలేదనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో బైరెడ్డిపల్లి ఎంపీడీవో రాజేంద్రబాలాజీ తాజాగా ఆ మండలంలోని పదిమంది జేఎల్‌ఎంలు విధులకు రావడంలేదని ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈకి ఫిర్యాదు చేశారు. వీరికి జీతాలను ఆపేయాలని సూచించారు. కానీ ట్రాన్స్‌కో దీనిపై అసలు పట్టించుకోలేదు. దీంతో జేఎల్‌ఎంలు ఇప్పుడు ఎవరిమాట వినే పరిస్థితి లేదని తెలిసింది.

నెలకు జీతం రూ.35వేలు వృథానేనా?

సచివాలయాల్లోని జేఎల్‌ఎంలకు నెలకు వేతనం రూ.35వేలుగా ఉంది. అంటే రోజుకి వెయ్యికిపైగానే. కానీ వీరు చేసేందుకు ఎలాంటి పనిలేకుండా పోయింది. అసలు వీరిని పట్టించుకోవడం లేదు. వీరిపై పర్యవేక్షణ లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీరిని ఆయా శాఖలకు అనుసంధానం చేస్తామన్నారు. మళ్లీ సచివాలయాలను బలోపేతం చేస్తామన్నారు. కానీ ఎలాంటి నిర్ణయం తీసుకోక సచివాలయ వ్యవస్థ రోజు రోజుకూ నిర్వీర్యమవుతోంది.

అడ్రస్ లేని జేఎల్‌ఎంలు



మా మండలంలో పదిమంది జేఎల్‌ఎంలు ఏమయ్యారో తెలీదు. వీరిలో చాలామంది బయోమెట్రిక్‌కు హాజరుకావడం లేదు. వీరిని పర్యవేక్షించే ట్రాన్స్‌కో ఏఈలు ఎందుకు పట్టించుకోవడం లేదు. వీరేమో అందుబాటులో ఉండరు.

– మొగసాల రెడ్డెప్ప, ఎంపీపీ, బైరెడ్డిపల్లి

చర్యలు తీసుకుంటాం



జేఎల్‌ఎంలపై ఏఈలు పర్యవేక్షణ ఉండాలి. వీరు జీతాలు తీసుకొని బాధ్యతలు నిర్వహించకుంటే ఉపేక్షించేది లేదు. దీనిపై వెంటనే తానే స్వయంగా పర్యవేక్షించి విధులకు రాని వారిపై చర్యలు తీసుకుంటా.

– శ్రీనివాసమూర్తి, ట్రాన్స్‌కో ఈఈ, పుంగనూరు



రాష్ట్ర ప్రజలకూ తప్పని వెన్నుపోటు


వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, నాయకులు

కార్వేటినగరం: పిల్లనిచ్చిన సొంత మామనే కాదు.. అధికారం కోసం యావత్తు రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచిన ఘనత సీఎం చంద్రబాబుదే అని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి విమర్శించారు. ఆయన ఆదివారం శ్రీరంగరాజపురం మండలంలో వెన్నుపోటు దినం పోస్టర్‌ను నాయకులతో కలసి ఆవిష్కరించారు. నారాయణస్వామి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లలో జగనన్న గడప వద్దకే సంక్షేమ పథకాలు అందించారని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో అలవికాని హామీలు ఇచ్చిన చంద్రబాబు నేడు వాటిని నెరవేర్చకుండా ప్రజలను మభ్యపట్టే కార్యక్రమం చేస్తున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు ఈ నెల 4వ తేదీ నియోజకవర్గకేంద్రంలో నిర్వహించనున్న వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, మండల కన్వీనర్ మణి, నాయకులు జనార్దన్, రాజశేఖర్‌రెడ్డి, హరిరెడ్డి, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు కుప్పయ్య, నియోజకవర్గ యువత అధ్యక్షుడు కిషోర్‌రెడ్డి, యువనాయకుడు శ్యామ్, కాళప్ప, మణి పాల్గొన్నారు.

తమిళనాడు, ఏపీ ఉద్యాన అధికారుల చర్చలు


సమావేశంలో మాట్లాడుతున్న తమిళనాడు, ఏపీ ఉద్యానశాఖ అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లోని పండ్ల గుజ్జు పరిశ్రమల ప్రలోభాలకు రైతులు గురికాకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మామిడి ధరలపై క్రిష్ణగిరి, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు ఇప్పటికే సమన్వయ సమీక్ష నిర్వహించారు. ఈ క్రమంలో తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి జిల్లా ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ మోహన్ ఆధ్వర్యంలో ఐదుగురు అధికారులతో కూడిన బృందం ఆదివారం చిత్తూరు జిల్లా ఉద్యానశాఖ కార్యాలయం చేరుకుంది. ఉద్యానశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి, ఏడీ కోటేశ్వర్‌రావుతో మామిడి ధరలపై సుదీర్ఘంగా చర్చలు జరిపారు. క్రిష్ణగిరి, చిత్తూరు జిల్లాలో మామిడి ధరల్లో తేడా లేకుండా చూసుకోవాలని తీర్మానించారు. మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. ఇందుకు రెండు జిల్లాల కలెక్టర్లు ఆమోదం తెలపనున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR

■Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA. Regular/lateral entry.9361287629

ONE/TWO SITTING

■ One/Two Sitting 10th, Inter, ITI, Degree, B.Tech, Diploma, (4 నెలల్లో పూర్తి చేసే అవకాశం) సంప్రదించండి. Cell: 9393622612

Wanted

■OM NARAYANA E.M. HIGH SCHOOL, Yerpedu . Wanted: Primary & High School Teachers (All Subjects & Computer, Exp:3 to 5 Years, Salary : PP- 10K, HS-12K to 15K, Cell : 81068 91985.

■GP Electricals, Tirupati.Hiring-Walk In-Accountant/System Administrator/ Receptionist, Accountant-Degree with 5Yrs Accountant Exp. Understanding of GST,TDS, ITR along with CA Exp. Audits, Projections,CashFlow, Reconciliations, Ledgers System Admin-Degree, Computer Skills & 3Yrs Exp.,Receptionist-Degree, 3Yrs Exp. ✆ 9133309137,Email:gurappaparameswara@gmail.com

■ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థయందు పనిచేయుటకు Female Employees కావలెను. కనీస విద్యార్హత: 10th & above.✆ 9505850438.

■AN ISO 90001-2000 Company, PCR Ware Housing Limited. ,"Poineers in Logistics". Required candidates Immediately, Can Apply Senior Accountant- Knowledge in Accountancy with Exp. of 5 yrs in the latest Tally Version.Accounts Manager-Min.2yrs Exp. with latest Tally Version. (B.Com/ M.Com).The Manager (Commercial),356, 2nd Floor, Gandhi Road, Tirupathi. 0877-2227579/2227269, Email: pcrwhltd@gmail.com, commercial@drpcrayulu.com

■తిరుపతి శ్రీకాళహస్తి హైవే మెర్లపాక వద్ద హోటల్ పద్మావతి నందు పనిచేయుటకు సప్లయర్స్, సెక్యూరిటీ, సౌత్ ఇండియన్ మాస్టర్ కావలెను. ఉచిత వసతి కలదు. 95504 97002.

■ప్రైవేట్ మినీ బ్యాంక్‌లో పని చేయుటకు అనుభవం కలిగిన సెక్యూరిటీ గార్డులు కావలెను. (స్థలం: పుంగనూరు) సెల్: 8019584141.

■కష్టెల్లేనీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ. 15 వేలు -40వేలు,ప్రీదాం+భోజనం.Hyd.7995365999

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

గమనిక

ఉత్సవాల ఆరంభం సందర్భంగా సేనాధిపతి ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు



నేటి నుంచి గోవిందుడి బ్రహ్మోత్సవాలు

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజ స్వామివారి ఆలయంలో ఈనెల 2వ తేదీ సోమవారం నుంచి 10వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వేడుకగా జరుగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను టీటీడీ పూర్తి చేసింది. స్వామివారి బ్రహ్మోత్సవాలకు ఆదివారం సాయంత్రం 5.30 నుంచి 8 గంటల మధ్య శాస్త్రోక్తంగా అంకురార్పణ చేపట్టారు. పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డెప్యూటీ ఈఓ వీఆర్.శాంతి, ఏఈఓ కె.మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ ధనుంజయరావు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 7.02 నుంచి 7.20 గంటల మధ్య మిథున లగ్నంలో ధ్వజారోహణం నిర్వహిస్తారు. శ్రీగోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతి రోజు ఉదయం 7 నుంచి 9 గంటల వరకు, తిరిగి రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి వాహన సేవలు జరుగనున్నాయి.


ఆలయ ఆవరణలో ఆకట్టుకుంటున్న విద్యుద్దీపాలంకరణ


ఆలయంలో అంకురార్పణ గావిస్తున్న వేదపండితులు

కుక్కల దాడిలో రెండు పొట్టేళ్లు మృతి


కుక్కల దాడిలో మృతి చెందిన పొట్టేళ్లు

చౌడేపల్లె: కుక్కల దాడిలో రెండు పొటేళ్లు మృత్యువాత పడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని కోటూరు హిదాయిత్‌నగర్‌కు చెందిన చాన్‌బాషా తన పొలం వద్ద పొటేళ్లు మేపుతుండగా మరొక రైతు పెంచుకుంటున్న కుక్కలు పొటేళ్లపై దాడిచేసి చంపేశాయి. ఈ ఘటనలో సుమారు రూ.20 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాధు చేసినట్లు చాన్‌బాషా పేర్కొన్నారు. నష్టపోయిన బాధితున్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

టెంపో ఢీకొని వ్యక్తి మృతి


రోడ్డుపై మృతి చెందిన చెంగప్ప

గుడుపల్లె: రోడ్డు దాటుతున్న వ్యక్తిని టెంపో ఢీకొనడంతో మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు కథనం మేరకు, మండలంలోని శెట్టిపల్లె గ్రామానికి చెందిన చెంగప్ప(60) కుప్పం నుంచి పలమనేరుకు వెళ్లే జాతీయ రహదారిపై శెట్టిపల్లె వద్ద ఉన్న రోడ్డు దాటుతున్న తరుణంలో బస్సు తగిలి కిందకు పడిపోయాడు. రోడ్డుపై పడిన వెంటనే వెనుక నుంచి వస్తున్న టెంపో ఢీ కొంది. దీంతో చెంగప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే గుడుపల్లె పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని చెంగప్ప బంధువులకు తెలియజేసి మృతదేహాన్ని కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కిటకిటలాడిన బోయకొండ



చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనం కోసం ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో అత్యంత సుందరంగా ముస్తాబు చేశారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, జంతు బలులిచ్చి మొక్కులు చెల్లించారు. ఒక్కసారిగా రద్దీ పెరగడంతో క్యూలన్నీ నిండి కిటకిటలాడాయి. భక్తులకు అవసరమైన సౌకర్యాలను ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో పర్యవేక్షించారు. భక్తులకు ఉచిత తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మరో రెండు కుంకీలు

పలమనేరు: మండలంలోని మొసలిమడుగు ఏనుగుల శిబిరానికి ఆదివారం మరో రెండు ఏనుగులను స్థానిక అటవీ అధికారులు తీసుకొచ్చారు. ఇక్కడి క్యాంపునకు ఇప్పటికే కర్ణాటకలోని మైసూరునుంచి శిక్షణ పొందిన నాలుగు కుంకీ ఏనుగులను తరలించారు. దీంతోపాటు కుప్పం ఫారెస్ట్ పరిధిలోని రామకుప్పం మండలం ననియాల క్యాంపులోని వినాయక, జయంత్ అని పిలిచే రెండు కుంకీ ఏనుగులను అధికారులు ఇక్కడికి ప్రత్యేక వాహనాల్లో తీసుకొచ్చారు. దీంతో ఇక్కడి క్యాంపులో మొత్తం ఆరు కుంకీలు ఉన్నాయి. వీటికి అవసరమైన మేతను అధికారులు అందజేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు స్థానిక ఎఫ్ఆర్వో నారాయణ తెలిపారు. వీటి ద్వారా ఈ ప్రాంతంలో ఏనుగులను అదుపు చేయనున్నారు.



ననియాల నుంచి తీసుకొస్తున్న కుంకీ ఏనుగులు